ANN తెలుగు
Follow: @ANNTELUGU
REGISTERED NUMBER: APTEL/2014/58382
04-11-2025
# మహా పత్రిక
తిరుపతి, హైదరాబాద్ సంపుటి- 22 సంచిక- 316 పేజీలు-04 వెల-రూ.6
PUBLISHED FROM TIRUPATI | HYDERABAD మంగళవారం WWW.EPAPER.MAHAADAILY.COM



## కమీషన్లు రావనే ఎస్ఎల్బీసీని కేసీఆర్ పట్టించుకోలే

జగన్ పోతిరెడ్డిపాడు విస్తరిస్తుంటే చూస్తూ ఊరుకున్నారు

ఎన్ని అవాంతరాలు ఎదురైనా టన్నెల్ పనులు పూర్తి చేసి తీరుతాం: సీఎం రేవంత్ స్పష్టం

హెలీ మాగ్నటిక్ సర్వే పనులను పరిశీలించిన ముఖ్యమంత్రి

**అచ్చంపేట, మహా:** శ్రీశైలం ఎడమ గట్టు కాలువ (ఎస్ఎల్బీసీ) టన్నెల్ పనులను ఎట్టి పరిస్థితుల్లోనూ పూర్తి చేయాలని ప్రభుత్వం దృఢ సంకల్పంతో ఉందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పునరుద్ఘాటించారు. ఎన్ని అడ్డంకులొచ్చినా తొలగించుకుంటూ ఈ ప్రాజెక్టును పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. ఎస్ఎల్బీసీ టన్నెల్ పనుల కోసం నేషనల్ జియోఫిజికల్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ (ఎన్జీఆర్ఐ) శాస్త్రవేత్తల నేతృత్వంలో అచ్చంపేట మండలం మన్నెవారిపల్లి వద్ద ముఖ్యమంత్రి సమక్షంలో హెలికాప్టర్ ద్వారా హెలిబోర్న్ ఏరియల్ ఎలక్ట్రోమ్యాగ్నెటిక్ సర్వే ప్రారంభమైంది. ఈ సందర్భంగా మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, స్థానిక శాసనసభ్యులతో కలిసి ముఖ్యమంత్రి మీడియాతో మాట్లాడారు.

మిగతా 2లో

### టాప్ న్యూస్

మా దగ్గర ఉన్న అణ్వాయుధాలతో ప్రపంచం మొత్తాన్ని 150 సార్లు పేల్చేయవచ్చు
- మేం కూడా అణు పరీక్షలకు ఏర్పాట్లు ప్రారంభించింది
- ట్రంప్ సంచలన వ్యాఖ్యలు



02

స్థానిక సంస్థలకు ఎన్నికలపై 24న విచారణ
- ఎప్పుడు నిర్వహిస్తారని సర్కారుకు ప్రశ్నలు



02

బుల్డోజర్లకు అడ్డంగా పడుకుంటాం
- అర్ధరాత్రి ఫోన్ చేసినా అరగంటలో వస్తా
- జూబ్లీహిల్స్ ప్రచారంలో కేటీఆర్



02



## ఆదిలాబాద్‌లో రయ్.. రయ్
- ఎయిర్‌పోర్టు భూసేకరణకు తెలంగాణ సర్కార్ గ్రీన్ సిగ్నల్
- 700 ఎకరాల భూసేకరణ చేపట్టాలని కలెక్టర్‌కు సర్కార్ ఉత్తర్వులు
- ఆదిలాబాద్ ఎయిర్‌పోర్టు పనుల్లో కీలక ముందడుగు

వివరాలు 2లో



# కాంగ్రెస్‌దే జూబ్లీహిల్స్

## సైదులు సర్వే సంచలనం

### కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య హోరాహోరీ

10వేలకు పైగా మెజారిటీతో నవీన్ గెలిచే అవకాశముందన్న సర్వే

లోకల్ అభ్యర్థి, సీఎం రేవంత్ ప్రతిష్టాత్మకంగా తీసుకోవడం ప్లస్ పాయింట్లు

పోలింగ్ సమీపిస్తున్న కొద్దీ బీఆర్ఎస్ డౌన్

బలంగా ఉన్న కమలం.. లైట్ తీసుకుంటున్న లీడర్స్



జూబ్లీహిల్స్ హస్తగతం అవుతుందని సైదులు సర్వే తేల్చిచెప్పింది. ఈనెల 11న పోలింగ్ జరుగుతుండగా, 9వ తేదీతో ప్రచారం ముగియనుంది. ఈ క్రమంలో ప్రీపోల్ సర్వేలు ట్రెండ్ ను చెబుతున్నాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రతిష్టాత్మకంగా తీసుకోవడంతో గత నాలుగురోజులుగా.. జూబ్లీహిల్స్ రాజకీయ లెక్కలు మారుతుండగా, సోమవారం ప్రెస్ క్లబ్ లో మీడియా సమావేశం నిర్వహించి సెఫాలజిస్ట్ సైదులు తన సర్వే వివరాలు ప్రకటించారు. సైదులు సర్వే ప్రకారం కాంగ్రెస్ పార్టీ జూబ్లీహిల్స్ లో ఇప్పటివరకు ఆధిక్యంలో ఉంది. బీఆర్ఎస్ కంటే 5.7శాతం మొగ్గు కాంగ్రెస్ కు ఉందని, తమ పరిశీలన.. గ్రౌండ్ రిపోర్ట్ ప్రకారం కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ 10వేలకు పైగా ఓట్ల ఆధిక్యంతో గెలిచే అవకాశముందని సైదులు తన అంచనా వెల్లడించారు. చివరిరోజుల్లో రాజకీయ వాతావరణం ఎవరు అనుకూలంగా మలుచుకుంటే వారికి అవకాశాలుంటాయన్నారు. కాంగ్రెస్ పార్టీకి ప్రధానంగా లోకల్ అభ్యర్థి నవీన్ యాదవ్ అభ్యర్థి కావడం, కాంగ్రెస్ అధికారంలో ఉండడం, ఎంఐఎం మద్దతు, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కమ్మ, మైనారిటీ సామాజికవర్గాలను తమ వైపుకు తీసుకునేందుకు వేస్తున్న ఎత్తులు వెరసి కాంగ్రెస్ కు అనుకూల వాతావరణం తెచ్చాయన్న విశ్లేషణలున్నాయి. అనూహ్యంగా బిజెపి పార్టీ బలంగా ఉందని, 15.3శాతం ఓట్లు బిజెపికి వచ్చే అవకాశముందని సైదులు సర్వేలో వెల్లడించారు. సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో నిర్వహించిన మీడియా సమావేశంలో సైదులు సర్వే వివరాలు వెల్లడించారు.

**- మహా, హైదరాబాద్**

వివరాలు 4లో

కాంగ్రెస్‌కు ఆధిక్యం ఉన్న **డివిజన్‌లు**
- రహమత్ నగర్ ✓
- ఎర్రగడ్డ ✓
- శ్రీనగర్ కాలనీ ✓
- షేక్ పేట ✓
- యూసుఫ్ గూడ ✓
- వెంగళరావునగర్ ✓

బీఆర్ఎస్ ఆధిక్యం
- బోరబండ ✓






## కాళేశ్వరం కమీషన్ సొమ్ముతో బిఆర్ఎస్ కుట్ర
- కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూలదోయడానికి పన్నాగాలు
- 500 రోజుల్లో ఎలా కూలుస్తారో చూస్తా
- జూబ్లీహిల్స్ ప్రచారంలో మంత్రి పొంగులేటి

వివరాలు 3లో




## కలుషిత నీటితో విద్యార్థుల ప్రాణాల ముప్పు!

ఆరెంజ్ పాఠశాలలో విషజలాలు
- చిన్నారి సుజిత్ మృతి!
- కొండముచ్చు మృతదేహం కారణమా?
- విద్యార్థులకు కొనసాగుతున్న వైద్య పరీక్షలు

02

| బంగారం ధరలు | |
|---|---|
| 24 క్యారెట్ | 1,23,170 |
| 22 క్యారెట్ | 1,12,900 |
| సిల్వర్ (కేజీ) | 1,54,000 |

# మాటలకందని మహా విషాదం

## చేవెళ్లలో ఘోర ప్రమాదం.. 21 మంది దుర్మరణం


### బస్సును ఢీకొన్న లారీ.. కంకరలో కలిసిపోయిన ప్రాణాలు

మృతుల్లో బస్సు, లారీ డ్రైవర్లతో పాటు మహిళలు, చిన్నారి
- డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగానే ప్రమాదం.. కన్నీరు పెట్టిస్తున్న దృశ్యాలు
- పది మందికిపైగా కంకర కిందే సమాధి.. కాపాడమంటూ మరికొందరు ఆర్తనాదాలు
- క్షతగాత్రులను పరామర్శించిన మంత్రులు శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్
- మోదీ, రేవంత్, కేసీఆర్ సంతాపం.. మృతులకు రూ. 7 లక్షల ఎక్స్ గ్రేషియా
- ప్రమాదానికి టిప్పర్ డ్రైవర్ కారణమన్న పోలీసులు.. బస్సు, లారీ డ్రైవర్లు మృత్యువాత

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి, మహా:** ఏపీ కర్నూల్ బస్సు ప్రమాదం మరువక ముందే మరో విషాదం జరిగింది. చేవెళ్లలో ఘోర ప్రమాదం చోటు చేసుకుంది. బస్సులో సురక్షితంగా ప్రయాణిస్తున్న వారిపైకి మృత్యు శకటంలా లారీ దూసుకొచ్చింది. ఏం జరుగుతుందో తెలిసేలోపే.. ప్రాణాలుపోయాయి. ప్రయాణికుల ప్రాణాలను గాల్లో కలిపింది. టిప్పర్ లారీలోని కంకరే ఎక్కువ మంది ప్రాణాలు పోవడానికి కారణమైంది. కంకర ఒక్కసారిగా మీద పడటంతో.. ప్రయాణికులు ఎక్కువమంది చనిపోయారు.

మిగతా 2లో





# మాటలకందని మహా విషాదం

## చేవెళ్లలో ఘోర ప్రమాదం.. 21 మంది దుర్మరణం

(మొదటిపేజీ తరువాయి)

పది మందికిపైగా కంకర కిందే సమాధి అయ్యారు. ఈ ఘటనలో 21 మంది మృతి చెందారు. మృతుల్లో 18 మంది ప్రయాణికులు, ఇద్దరు బస్సు, టిప్పర్ డ్రైవర్లు ఉన్నారు. ఏడాది పాప సహా 11 మంది మహిళలు, 9 మంది పురుషులు మృతి చెందారు. 24 మందికి గాయాలు, ఐదుగురి పరిస్థితి విషమంగా ఉంది.

**బస్సులో 70 మంది ప్రయాణికులు..**

సోమవారం తాండూరు డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు హైదరాబాద్ వెళ్తున్న క్రమంలో, చేవెళ్ల మండలం, మీర్జాగూడ సమీపం వద్దకు చేరుకోగా, అటుగా వేగంగా వస్తున్న టిప్పర్ ఒక్కసారిగా బస్సును ఢీకొట్టడంతో ప్రమాదం జరిగినట్లు పోలీసులు తెలిపారు. బస్సులో 70 మంది వరకు ప్రయాణికులు ప్రయాణిస్తున్నట్లు తెలిపారు. ప్రమాదంలో అక్కడికక్కడే 19 మంది దుర్మరణం చందగా మరో ఇద్దరు చికిత్స పొందుతూ చనిపోయినట్లు తెలిపారు. క్షతగాత్రులను చేవెళ్ల ప్రభుత్వ దవఖానలో చికిత్స అందిస్తున్నట్లు తెలిపారు. దీంతో జిల్లాలో విషాద ఛాయలు నెలకొన్నాయి.

**సహాయక చర్యల్లో ప్రభుత్వ యంత్రాంగం...**

సీఎస్, డీజీపీ మొదలు యావత్తు యంత్రాంగం సహాయక చర్యల్లో నిమగ్నమయ్యింది. రవాణా శాఖ మంత్రి మంత్రి పొన్నం ప్రభాకర్, ఇతర మంత్రులు ఘటనాస్థలికి చేరుకొని పరిస్థితిని స్వయంగా పర్యవేక్షించారు. ప్రమాదానికి గల కారణాలను తెలుసుకునేందుకు ఇప్పటికే మెజిస్ట్రియల్ విచారణకు ఆదేశించడం జరిగింది. అదే విధంగా శాఖాపరమైన విచారణ కూడా ఆదేశించామని మంత్రులు తెలిపారు. బాధితులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్యులకు, అధికారులకు సూచించారు. రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి ప్రమాద స్థలానికి వెళ్ళి పరిస్థితిని పర్యవేక్షించారు. చేవెళ్ల ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బస్సు ప్రమాద ఘటన క్షతగాత్రులను పరామర్శించారు.

**చెదిరిన కలలు, చెరిగిన జీవితాలు..**


మీర్జాగూడ రోడ్డు ప్రమాదం ఎన్నో కుటుంబాల్లో విషాదం నింపింది. ఉపాధి కోసం బయల్దేరిన కూలీలు, ఉద్యోగానికి వెళ్తున్న మరికొందరు, చదువు కొరకై వెళుతున్న విద్యార్థులు, రైలు మిస్ కావడంతో బస్ అందుకున్న ముగ్గురు అక్కాచెల్లెళ్లు.. ఇలా ప్రతి ఒక్కరిదీ ఒక్కో కథ, కల. కానీ అవన్నీ ఒక్క ప్రమాదంతో కల్లలయ్యాయి. కంకర టిప్పర్ రూపంలో దూసుకొచ్చిన మృత్యువు, అందరి జీవితాలకు రాళ్ల సమాధి కట్టింది.

**కుటుంబాలను చిదిమేసిన కంకర..**

చేవెళ్ల మండలం మీర్జాగూడ రోడ్డు ప్రమాదం బాధిత కుటుంబాలను రోడ్డున పడేసింది. టిప్పర్ రూపంలో కుటుంబాలను మృత్యువు కబళించింది. కుప్పలుగా మృతదేహాలను చేవెళ్ల ఆస్పత్రిలో చూసిన కుటుంబీకులు గుండెలు పగిలేలా ఏడ్చారు. మృతుల్లో చేవెళ్లకు చెందిన ముగ్గురు అక్కాచెల్లెళ్లు ఉన్నారు. తల్లి ఒడిలో తనువు చాలించిన చిన్నారిని చూసి బంధువులు చలించిపోయారు. ఆస్పత్రి ఆవరణం శోకసంద్రంతో నిండిపోయింది.

**నేతలపై స్థానికుల ఆగ్రహం...**

చేవెళ్లలో జరిగిన ఘోర బస్సు ప్రమాదంతో స్థానికులు, నాయకులపై మండిపడుతున్నారు. చాలా కాలంగా హైదరాబాద్‌బీజాపూర్ రహదారిపై ప్రమాదాలు జరుగుతున్న, రోడ్డు విస్తరణ పనులు చేపట్టాల్సి ఉన్నా, ఎందుకు పూర్తి చేయలేదని, బాధితులను పరామర్శించేందుకు వచ్చిన ఎమ్మెల్యే యాదయ్యతో పాటు, మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డికి, బాధితుల కుటుంబ సభ్యులు, స్థానికులు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ, గత పాలకుల వాళ్లే, అమాయక కుటుంబాలు చిద్రమయాయాన్ని ఆగ్రహం వ్యక్తం చేశారు..




### మోదీ, రేవంత్ దిగ్భ్రాంతి..

తెలంగాణలోని చేవెళ్లలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంపై ప్రధాని నరేంద్ర మోదీ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. క్షతగ్రాతులు త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు. మృతుల కుటుంబాలకు రూ.2 లక్షలు, గాయపడిన వారికి రూ.50 వేల చొప్పన ఆర్థిక సాయం అందించనున్నట్లు తెలిపారు. రంగారెడ్డి జిల్లాలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంపై సీఎం రేవంత్‌రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఘటనాస్థలిలో సహాయక చర్యలు ముమ్మరం చేయాలని జిల్లా కలెక్టర్‌ను ఆదేశించారు. ప్రమాద వివరాలను ఎప్పటికప్పుడు తెలియజేయాలని జిల్లా అధికారులకు సూచించారు. క్షతగాత్రులను హైదరాబాద్‌కు తరలించి మెరుగైన వైద్యం అందించాలని సీఎస్, డీజీపీని ఆదేశించారు. అందుబాటులో ఉన్న మంత్రులు ఘటనాస్థలికి వెళ్లి పర్యవేక్షించాలని కోరారు. క్షతగాత్రులకు తగిన వైద్యం అందించేందుకు గాంధీ, ఉస్మానియా ఆసుపత్రుల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని సీఎం అదేశించారు. పరిస్థితి విషమంగా ఉన్న వారందరినీ కాపాడేందుకు వైద్య బృందాలను అందుబాటులో ఉంచాలని.. హెల్త్ ఎమర్జెన్సీ తరహాలో అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు.

**క్షతగాత్రులకు పరామర్శ..**

సోమవారం చేవెళ్ల ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బస్సు ప్రమాద ఘటన క్షతగాత్రులను రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పరామర్శించారు. ఈ సందర్భంగా చేవెళ్ల ఏరియా ఆసుపత్రి దగ్గర మంత్రి శ్రీధర్ బాబు మీడియాతో మాట్లాడుతూ... ఇదొక దురదృష్టకర ఘటన. విషయం తెలిసిన వెంటనే తీవ్ర దిగ్భ్రాంతికి లోనయ్యానని ఆయన అన్నారు. మృతుల కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం తరపున ప్రగాఢ సంతాపాన్ని తెలియజేస్తున్నాని, బాధితులకు ప్రభుత్వం తరపున అన్ని రకాలుగా అండగా ఉంటామని అన్నారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందిస్తాం. మృతులకు రూ.7 లక్షల ఎక్స్ గ్రేషియాను అందించనున్నామని అన్నారు. ప్రమాదం జరిగిన విషయం తెలిసిన వెంటనే సీఎం రేవంత్ రెడ్డి స్పందించారు. మంత్రులు, అధికారులను అప్రమత్తం చేశారు. వెంటనే ఘటనాస్థలికి వెళ్లాల్సిందిగా ఆదేశించారు. వాస్తవ పరిస్థితి, ప్రమాదం జరిగిన తీరును మంత్రులు, అధికారులను అడిగి తెలుసుకున్నారు. బాధితులకు అందుతున్న వైద్య సేవలు, సహాయక చర్యలపై ఎప్పటికప్పుడు ఆరా తీస్తున్నారని తెలిపారు.

**గత ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లనే ప్రమాదం: కొండా విశ్వేశ్వర్ రెడ్డి..**

మీర్జాగూడ బస్సు ప్రమాదానికి గత బీఆర్ఎస్ ప్రభుత్వ నిర్లక్ష్యం కారణమని బీజేపీ ఎంపీ విశ్వేశ్వర్ రెడ్డి అన్నారు. 2017లో ఈ రహదారికి కేంద్రం నిధులు సమకూరిస్తే అప్పటి ప్రభుత్వం సమయానికి భూసేకరణ చేయలేదని ఆరోపించారు. రహదారి నిర్మాణానికి కొందరు వ్యక్తులు అభ్యంతరం వ్యక్తం చేశారన్నారు. ప్రస్తుతం కోర్టు కేసులు పూర్తయ్యాయని, ఏడాదిన్నరలో రోడ్డు పూర్తి కావొచ్చన్నారు.

**విచారణకు ఆదేశం: మంత్రి పొన్నం..**

రంగారెడ్డి జిల్లా చేవెళ్లలో జరిగిన బస్సు ప్రమాదంలో మృతుల సంఖ్య 21 చేరిందని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. తొలుత 19 మంది చనిపోగా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మరో ఇద్దరు మరణించారని పేర్కొన్నారు. మొత్తం మృతుల సంఖ్య 21కి చేరుకుందని తెలిపారు. మృతుల్లో పది మంది మహిళలు, రెండు నెలల చిన్నారి ఉన్నారని చెప్పారు. మరో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉందన్నారు. ఈ దుర్ఘటనపై విచారణకు ఆదేశించామని ఆయన వెల్లడించారు.

**టిప్పర్ డ్రైవర్ కారణంగానే ప్రమాదం...**

చేవెళ్లలో జరిగిన బస్సు ప్రమాదానికి టిప్పర్ డ్రైవర్ కారణమని పోలీసులు గుర్తించారు. అతడు మహారాష్ట్రకు చెందిన ఆకాశ్ అని వెల్లడించారు. మహబూబ్ నగర్ జిల్లాకు చెందిన లచ్చా నాయక్ దగ్గర డ్రైవర్‌గా పని చేస్తున్నాడని తెలిపారు. మెదక్ జిల్లా పటాన్ చెరువు క్రషర్ నుంచి వికారాబాద్ కు కంకర తీసుకెళ్తుండగా మీర్జాగూడ సమీపంలో ఈ ప్రమాదం జరిగిందని పోలీసులు తెలిపారు. ఈ ఘటనలో టిప్పర్ డ్రైవర్ ఆకాశ్ కూడా చనిపోయాడు.

---

# కమీషన్లు రావనే ఎస్ఎల్బీసీని కేసీఆర్ పట్టించుకోలే...

## జగన్ పోతిరెడ్డిపాడు విస్తరిస్తుంటే చూస్తూ ఊరుకున్నారు

### ఎన్ని అవాంతరాలు ఎదురైనా టన్నెల్ పనులు .. పూర్తి చేసి తీరుతాం: సీఎం రేవంత్ స్పష్టం

### హెలీ మాగ్నటిక్ సర్వే పనులను పరిశీలించిన ముఖ్యమంత్రి

(మొదటిపేజీ తరువాయి)

రెండు దశాబ్దాల కాలంగా పెండింగ్లో ఉన్న ఈ ప్రాజెక్టును మా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తిరిగి చేపట్టామని గుర్తు చేశారు. ఆ క్రమంలో ఎదురైన అనుభవాలను దృష్టిలో పెట్టుకుని మిగిలిపోయిన 9.8 కిలోమీటర్ల పనుల కోసం ఎన్జీఆర్ఐ శాస్త్రవేత్తలు, టన్నెల్ నిర్మాణాల్లో అనుభవం కలిగిన ఆర్మీ అధికారుల సేవలను వినియోగించి ముందుకు వెళుతున్నామని చెప్పారు. టన్నెల్ బోర్ మిషన్‌తో పనులు చేయడం కష్టంగా మారిందని, పనులపై బీఆర్ఎస్ నాయకులు రాజకీయం చేయడం తగదని అన్నారు. ఎన్ని అవాంతరాలు ఎదురైనా.. టన్నెల్ పనులు పూర్తి చేసి తీరుతామని స్పష్టం చేశారు. కేసీఆర్ ప్రభుత్వం పదేళ్లలో మిగతా 10కి.మీ టన్నెల్ పూర్తి చేయలేదని, పెద్దగా కమీషన్లు రావని ఈ ప్రాజెక్టును పక్కకు పెట్టారని విమర్శించారు. ఏపీలో జగన్ ప్రభుత్వం పోతిరెడ్డిపాడును విస్తరిస్తుంటే కేసీఆర్ చూస్తూ ఊరుకున్నారని అన్నారు. కృష్ణా నది మీద చేపట్టిన అన్ని ప్రాజెక్టులను కేసీఆర్ నిర్లక్ష్యం చేశారు. గత పదేళ్లలో సాగునీటి ప్రాజెక్టు కాంట్రాక్టర్లకు కేసీఆర్ ప్రభుత్వం రూ.1.86 లక్షల కోట్లు చెల్లించింది. ఆ మొత్తంలో కాళేశ్వరం కాంట్రాక్టర్లకే రూ.1.06 లక్షల కోట్లు చెల్లించారు. గత పదేళ్లలో ఏపీ ప్రభుత్వం కృష్ణా నదిపై ఎన్నో ప్రాజెక్టులు చేపట్టి పూర్తి చేసింది. తెలంగాణలో మాత్రం కేసీఆర్ ప్రభుత్వం కృష్ణానదిపై ప్రాజెక్టులు పూర్తి చేయలేదు' అని రేవంత్‌రెడ్డి అన్నారు.

**రెండు దశాబ్దాల పాటు పనులు జరగలేదు..**


'ఎన్జీఆర్ఐ నేతృత్వంలో నిర్వహిస్తున్న సర్వే వల్ల భూగర్భంలో 800 నుంచి 1000 మీటర్లలోపు ప్రతి 2.5 మీటర్లలో రాయి, నీటి ప్రవాహాలకు సంబంధించిన పరిస్థితి ఎలా ఉందన్నది తెలుస్తుంది. ఈ ప్రాజెక్టు ప్రాంతమంతా టైగర్ రిజర్వ్ ఉంది. పర్యావరణం విషయంలో కూడా చాలా జాగ్రత్తలు తీసుకోవాలి. గ్రావిటీ ద్వారా 30 టీఎంసీలను 3 లక్షల ఎకరాలకు సాగునీరు, 30 లక్షల మందికి తాగునీరు సరఫరాకు ఉద్దేశించిన ఈ ప్రాజెక్టుకు 1983 లోపునాది పడినప్పటికీ ఆ తర్వాత రెండు దశాబ్దాల పాటు పనులు జరగలేదు. తిరిగి 2004 లో నల్గొండ జిల్లా ప్రజాప్రతినిధుల ఒత్తిడి మేరకు ఆనాటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో ప్రాజెక్టు టన్నెల్ 1, టన్నెల్ 2 పనులు ప్రారంభమయ్యాయి. గ్రావిటీ ద్వారా నీటిని తరలించే ఈ ప్రాజెక్టు 44 కి.మీ టన్నెల్ కోసం ఆనాడు దాదాపు 33 కి.మీ పూర్తి చేయగా, గత ప్రభుత్వ హయాంలో దశాబ్దకాలం ఈ ప్రాజెక్టు పూర్తిగా నిర్లక్ష్యానికి గురైంది. ప్రాజెక్టును ప్రారంభించిన నాడు ప్రపంచంలోనే అత్యంత అధునాతన టన్నెల్ బోర్ మిషన్ ఉపయోగించి ప్రయోగాత్మకంగా పనులు చేపట్టారు. దేశంలోనే ఇదొక అత్యుత్తమ ప్రాజెక్టు. 44 కి.మీ టన్నెల్ ప్రాజెక్టు ప్రపంచంలోనే మరెక్కడా లేదు. ఈ ప్రాజెక్టు పూర్తయితే తెలంగాణకు మంచి పేరు రావడమే కాకుండా నయా పైసా ఖర్చు లేకుండా గ్రావిటీతో నీటిని సరఫరా చేయొచ్చు. ప్రస్తుతం ఏఎంఆర్ ప్రాజెక్టు ద్వారా తరలిస్తున్న నీటికి కేవలం విద్యుత్ చార్జీల కోసం ఏటా 500 కోట్ల రూపాయలు చెల్లించాల్సి వస్తోంది.



**గ్రీన్ చానెల్ ద్వారా మంజూరు చేస్తాం..**

మా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఎస్ఎల్బీసీని పూర్తి చేయాలని సంకల్పంతో ముందుకు వెళ్లినప్పుడు ఊహించని ప్రమాదం సంభవించింది. మాకెంతో బాధ కలిగించింది. ప్రమాదంలో మరణించిన కుటుంబాలను ఆదుకున్నాం. అందుకే అనుభవం, అత్యంత నైపుణ్యం ఉన్న వారిని ఇక్కడికి రప్పించాం. ప్రాజెక్టును పూర్తి చేయడానికి భారత సైన్యం నుంచి కూడా అధికారిని డిప్యుటేషన్‌పై తెచ్చుకున్నాం ఈ క్రమంలో టన్నెల్ పనులను ముందుకు తీసుకెళ్లడానికి భూగర్భంలో ఉన్న పరిస్థితులను అధ్యయనం చేయడానికి ఈ సర్వేను చేపట్టాం. పైగా అదనంగా పైగా ఖర్చు లేకుండా ఆనాడు వేసిన అంచనాలతోనే ఈనాడు పనులు పూర్తి చేయనున్నాం. నీటి పారుదల ప్రాజెక్టుల విషయంలో ఉమ్మడి మహబూబ్‌నగర్, నల్గొండ జిల్లాలకు ఇప్పటికే తీవ్ర నష్టం వాటిల్లింది. ఈ ప్రాజెక్టును పూర్తి చేయకపోతే ప్రజలు క్షమించరు. ఇప్పుడు పూర్తి చేసుకోలేకపోతే మరెప్పుడూ పూర్తి చేసుకోలేం. ఎన్ని అడ్డంకులొచ్చినా తొలగించుకుంటూ దీన్ని పూర్తి చేసుకోవలసిన బాధ్యత అందరిపైనా ఉంది. నిధులకు ఎలాంటి ఆటంకం లేదు. గ్రీన్ చానెల్ ద్వారా మంజూరు చేస్తాం. ప్రాజెక్టు పనులను పూర్తి చేయడానికి మర్లపాడు తండా, కేశీ తాండా, నక్కలగండి తాండా వాసులకు డిసెంబర్ 31 నాటికి ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ చెల్లింపులు పూర్తి చేస్తాం. ఈ ప్రాజెక్టు కింద భూములు కోల్పోతున్న వారికి ఎలాంటి నష్టం లేకుండా ఆదుకునే బాధ్యత ప్రభుత్వానిది' అని స్పష్టం చేశారు.

---



# ఆదిలాబాద్‌లో రయ్.. రయ్

- ఎయిర్‌పోర్టు భూసేకరణకు తెలంగాణ సర్కార్ గ్రీన్ సిగ్నల్
- 700 ఎకరాల భూసేకరణ చేపట్టాలని కలెక్టర్‌కు సర్కార్ ఉత్తర్వులు
- ఆదిలాబాద్ ఎయిర్‌పోర్టు పనుల్లో కీలక ముందడుగు

**హైదరాబాద్, మహా:** ఆదిలాబాద్ ఎయిర్‌పోర్టు భూసేకణకు తెలంగాణ ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. ఆదిలాబాద్‌లో 700 ఎకరాల భూసేకరణ చేపట్టాలని కలెక్టర్‌కు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఏయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఏఏఐ) చేసిన సాంకేతిక-ఆర్థిక అధ్యయన నివేదికను ఆధారంగా తీసుకొని, తెలంగాణ ప్రభుత్వం భూ సేకరణకు అనుమతి ఇచ్చింది. ఏర్ పోర్టు నిర్మాణానికి 700 ఎకరాల భూమి అవసరం ఉంటుందని దాని కోసం భూసేకరణ చేపట్టాలని ఉత్తర్వుల్లో పేర్కొంది. ఈ భూమిని రైటల్ అండ్ బిల్డింగ్స్ (ఎయిర్‌పోర్ట్స్) విభాగం ద్వారా జిల్లా కలెక్టర్ కు ఇవ్వబడిన ఆదేశాల ప్రకారం సేకరించాల్సి ఉంటుంది. ఆదిలాబాద్ ప్రాంతంలో ప్రాంతీయ విమాన సదుపాయాన్ని పెంచడం, స్థానిక అభివృద్ధి, వ్యాపారం, సౌకర్యాలు మెరుగ్గా చేయడం కోసం ఈ ప్రాజెక్టును రాష్ట్ర ప్రభుత్వం చేపట్టింది. మహారాష్ట్రకు దగ్గరగా ఉండడంతో ఆదిలాబాద్ లో ఏయిర్‌పోర్టు నిర్మాణానికి ప్రభుత్వం మొగ్గు చూపుతోంది. కాగా, జిల్లా కేంద్రంలోని ఏరోడ్రమ్ ప్రాంతంలో గతంలోనే సర్వే నిర్వహించిన 369 ఎకరాల భూమిలో చిన్న విమానాశ్రయాన్ని నిర్మించాలని భావించారు. అయితే భవిష్యత్ ను దృష్టిలో పెట్టుకుని ఈ ప్రాంతంలో భారీ విమానాశ్రయాన్ని నిర్మించాలని ఏఏఐ నిర్ణయించడానికి ఇటీవలే గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. తాజాగా తెలంగాణ ప్రభుత్వం 700 ఎకరాల స్థల సేకరణకు నాంది పలికింది. ఓవైపు విమానాశ్రయం.. మరోవైపు భారతీయ వాయుసేన (ఐఏఎఫ్) స్టేషన్ ను ఇక్కడ నిర్మించాలని ఏఏఐ నిర్ణయం తీసుకుంది.

---

# కలుషిత నీటితో విద్యార్థుల ప్రాణాల ముప్పు!

- ఆరెంజ్ పాఠశాలలో విషజలాలు
- చిన్నారి సుజిత్ మృతి!
- కొండముచ్చు మృతదేహం కారణమా?
- విద్యార్థులకు కొనసాగుతున్న వైద్య పరీక్షలు




**ఖమ్మం, మహా:** మెల్లచెరువు మండలంలోని ఆరెంజ్ పాఠశాలపై భయాందోళన వాతావరణం నెలకొంది. రెండు వారాలుగా చిన్నారులు వరుసగా వాంతులు, విరోచనాలు, జ్వరాలతో బాధపడుతుండగా, చివరికి ఆరెంజ్ పాఠశాలలో యూకేజీ చదువుతున్న 6 ఏళ్ల సుజిత్ రెడ్డి అనే విద్యార్థి మృతి చెందడంతో తల్లిదండ్రుల కన్నీటపర్యంతమవుతున్నారు. గత 20 రోజులుగా ఆ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు వాంతులు, విరోచనాలు, జ్వరాలతో బాధపడుతుండటంతో తల్లిదండ్రులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. పిర్యాదు మేరకు పాఠశాల యాజమాన్యం వైద్యాధికారుల సహాయంతో పాఠశాలలోనే వైద్య శిబిరం ఏర్పాటు చేసింది. వైద్యులు చేసిన పరిశీలనలో పిల్లలు కలుషిత నీటిని తాగడం వల్ల జాండీస్ (కామెర్లు) లివర్ సమస్యలతో బాధపడుతున్నట్లు నిర్ధారించారు. పరిస్థితి విషమించడంతో పలువురు విద్యార్థులను కోదాడ, ఖమ్మంలోని ప్రైవేట్ ఆసుపత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నారు. తల్లిదండ్రులు చెబుతున్న వివరాల ప్రకారం, ఒక్కో పిల్లవాడి చికిత్సకు రెండు నుండి మూడు లక్షల వరకు ఖర్చు అవుతోందని వాపోతున్నారు. అందులో యూకేజీ చదువుతున్న మెల్లచెరువుకు చెందిన చిన్నారి షాగంరెడ్డి సుజిత్ రెడ్డి (6) పరిస్థితి విషమించి మరణించడం తల్లిదండ్రుల మనోవేదనకు అంతు లేకుండా అయింది. వైద్యులు కిడ్నీ, లివర్, జాండీస్ ప్రభావం తీవ్రంగా ఉందని నిర్ధారించారు.

### కొండముచ్చు మృతి .. విషజలాల మూలం?

స్థానికుల సమాచారం ప్రకారం, ఆరెంజ్ పాఠశాల వాటర్ ట్యాంక్‌లో కొండముచ్చు పడి మృతి చెందిందని అనుమానం వ్యక్తమవుతోంది. ట్యాంక్ నీటికి దుర్వాసన రావడంతో పరిశీలించిన సిబ్బంది ఆ మృతదేహాన్ని బయటకు తీసి శుభ్రం చేసినప్పటికీ, ఆ నీటిని తాగిన విద్యార్థుల శరీరాల్లో ఇన్ఫెక్షన్ వ్యాప్తి చెందినట్లు వైద్యులు సూచిస్తున్నారు. అయితే, ఈ విషయం బయటకు రాకుండా పాఠశాల యాజమాన్యం మూతపడ్డట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. మా పిల్లలు బలైపోయారు... పాఠశాల వాళ్లు తమ తప్పు దాచుకున్నారు. ఇది నిర్లక్ష్యం కాదు, నేరం అని తల్లిదండ్రులు మండిపడుతున్నారు.

### వైద్యుల నిర్ధారణ..కలుషిత నీరే కారణం

అక్టోబర్ 7 నుండి 30 వరకు వైద్య శాఖ అధికారులు పాఠశాలలో వైద్య శిబిరం నిర్వహించారు. విద్యార్థుల రక్త నమూనాలను సేకరించి పరీక్షించిన తర్వాత, కలుషిత నీరు తాగడం వల్లే విద్యార్థులు జాండీస్, లివర్, కిడ్నీ సమస్యలకు గురయ్యారని నిర్ధారణ చేశారు. "ఇది స్పష్టమైన నీటి విషజన్య వ్యాధి కేసు" అని వైద్యులు తెలిపారు.

### తక్షణ చర్యలు తీసుకోండి

విద్యార్థుల తల్లిదండ్రులు విద్యా మరియు వైద్య శాఖ ఉన్నతాధికారులను విజ్ఞప్తి చేస్తూ, ఆరెంజ్ పాఠశాలను వెంటనే మూసివేయాలి. అందులో చదువుతున్న విద్యార్థులందరికీ మెరుగైన వైద్య పరీక్షలు చేయాలి. ఇప్పటికే చికిత్స పొందుతున్న విద్యార్థులను కార్పొరేట్ ఆసుపత్రులకు తరలించి పూర్తి వైద్య సేవలు అందించాలి. ఒక చిన్నారి మృతి చాలు... ఇంకొకరు బలవ్వకూడదు" అని విజ్ఞప్తి చేశారు.

### అధికారుల విచారణ అవసరం

ప్రజలు, తల్లిదండ్రులు ప్రభుత్వాన్ని ఉద్దేశించి "ఒక చిన్నారి ప్రాణం పోయింది... ఇప్పటికీ నిద్ర లేవకపోతే ఇంకెవరు బాధ్యత వహిస్తారు?" అని ప్రశ్నిస్తున్నారు. విద్యా శాఖ, వైద్య శాఖ, జిల్లా పరిపాలనా అధికారులు సంయుక్తంగా నిజనిర్ధారణ జరిపి పాఠశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

---



# బుల్డోజర్లకు అడ్డంగా పడుకుంటాం

### అర్ధరాత్రి ఫోన్ చేసినా అరగంటలో వస్తా
### జూబ్లీహిల్స్ ప్రచారంలో కేటీఆర్

**హైదరాబాద్, మహా :** ప్రతి పేద వాడికి తాము అండగా నిలబడతామని.. బుల్డోజర్లకు అడ్డంగా పడుకుంటామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పష్టం చేశారు. పక్కనే తెలంగాణ భవన్ ఉన్నదని.. అర్ధరాత్రి ఫోన్ చేసినా అరగంటలో మీ వద్దకు వస్తామని భరోసా ఇచ్చారు. కాంగ్రెస్ వాళ్లు భయపెడితే.. తాము వచ్చి వాళ్ల సంగతి తేలుస్తామన్నారు. కాంగ్రెస్‌కు ఓటేయకపోతే పథకాలు రద్దు చేస్తామని రేవంత్‌రెడ్డి జూబ్లీహిల్స్ ప్రజలను బెదిరిస్తున్నారని.. ఎవడబ్బ సొమ్మని పథకాలు బంద్ చేస్తారని మండిపడ్డారు. రంజాన్ తోఫా లేదు.. బతుకమ్మ చీర లేదు.. క్రిస్మస్ గిఫ్ట్ లేదు.. ఇలా అన్నీ బంద్ అయ్యాయని.. బీఆర్ఎస్‌ను గెలిపించండి.. కాంగ్రెస్ గల్లా పట్టి పథకాలు అమలు చేపిస్తామని చెప్పారు. హైదరాబాద్‌ను బర్బాద్ చేసిన కాంగ్రెస్‌కు ఈ ఎన్నికలో బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. 4 కోట్ల మంది ప్రజల తరఫున 4 లక్షల మంది జూబ్లీహిల్స్ ప్రజలు తీర్పు చెప్పబోతున్నారని అన్నారు. బోరబండలో వచ్చిన జనాన్ని చూస్తుంటే గెలుపు పక్కా అని తేలిపోయిందని.. మెజార్టీ ఎంత అనేది తేలాల్సి ఉందని అన్నారు.

---

# మా దగ్గర ఉన్న అణ్వాయుధాలతో ప్రపంచం మొత్తాన్ని 150 సార్లు పేల్చేయవచ్చు

**మహా :** మా దగ్గర ఉన్న అణ్వాయుధాలతో ప్రపంచం మొత్తాన్ని 150 సార్లు పేల్చేయవచ్చు. ఈ ఆయుధాల నిరాధీకరణ గురించి పుతిన్, జిన్‌పింగ్‌తో కూడా చర్చించాను. ఇప్పటికే అమెరికా అణు పరీక్షలకు ఏర్పాట్లు ప్రారంభించిందని'' ట్రంప్ అన్నారు. అయితే ఈ పరీక్షలు ఎక్కడ, ఎప్పుడు నిర్వహిస్తారనే దానిపై మాత్రం స్పష్టం చేయలేదు. సీబీఎస్ న్యూస్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేశారు. ప్రస్తుతం చాలా దేశాలు అణ్వాయుధాలను పరీక్షిస్తున్నాయని పేర్కొన్నారు. ఈ జాబితాలో పాకిస్థాన్ కూడా ఉందని తెలిపారు. '' చైనా, రష్యా, నార్త్ కొరియా, పాకిస్థాన్ లాంటి దేశాలు అణు పరీక్షలను



నిర్వహిస్తున్నాయి. కానీ వీటి గురించి ఆ దేశాలు మాట్లాడటం లేదు. మేము మాత్రం దాని గురించి బహిరంగంగానే మాట్లాడుతాం అని పేర్కొన్నారు.

---

# కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి

### జూబ్లీ హిల్స్ లో కాంగ్రెస్ గెలుపు ఖాయం .. మంత్రి వాకిటి శ్రీహరి

**హైదరాబాద్, మహా:** గత 10 ఏళ్లుగా బి.ఆర్.ఎస్ పార్టీ వల్ల జూబ్లీహిల్స్ అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగడి అక్కడే ఉందని మంత్రి వాకిటి శ్రీహరి విమర్శించారు.సోమవారం జూబ్లీహిల్స్ ఉపఎన్నిక సందర్భంగా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ కు మద్దతుగా వెంగళరావు నగర్ డివిజన్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు.అనంతరం 100 మంది స్థానిక బి.ఆర్.ఎస్ పార్టీ సానుభూతి పరులను కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ జూబ్లీహిల్స్ అనగానే ఎంతో అభివృద్ధి చెంది ఉంటుందని అనుకున్నా కానీ అసలు ఇక్కడ అభివృద్ధే లేదు.కాంగ్రెస్ ప్రభుత్వంతోనే జూబ్లీహిల్స్ అభివృద్ధి సాధ్యమన్నారు.అర్హులైన ప్రతి పేదవానికి సంక్షేమ పథకాలు అందించటమే మా ప్రభుత్వం లక్ష్యమని ఇందులో భాగంగానే గత ప్రభుత్వంలో అర్హుడై ఉండి సంక్షేమ పథకాలు అందని వారికి నూతన రేషన్ కార్డు మంజూరు చేసి పథకాలు అందిస్తున్నామని గుర్తు చేశారు.అంతేకాకుండా రేషన్ కార్డు ద్వారా ప్రతి పేదవాడికి 6 కిలోల సన్న బియ్యం అందిస్తున్నామని,మహిళా సాధికారతలో భాగంగా ఉచిత బస్,200 యూనిట్ల ఉచిత విద్యుత్ అమలు చేస్తున్నాం అన్నారు.కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఖాయమని మీ అందరికీ చూస్తుంటే తెలుస్తుందన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు మానాల మోహన్ రెడ్డి,మనోజ్ రెడ్డి తదితర కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు

# కాళేశ్వరం కమీషన్ సొమ్ముతో బీఆర్ఎస్ కుట్ర

## కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూలదోయడానికి పన్నాగాలు

## 500 రోజుల్లో ఎలా కూలుస్తారో చూస్తా.. జూబ్లిహిల్స్ ప్రచారంలో మంత్రి పొంగులేటి

**హైదరాబాద్, మహా:** కాళేశ్వరం ప్రాజెక్ట్‌లో అవినీతి చేసి సంపాదించిన లక్ష కోట్లను బిఆర్ఎస్ ఇప్పుడు రాజకీయాల్లో అడ్డదారిన ఉపయోగిస్తోందని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆరోపించారు. సోమవారం జూబ్లీహిల్స్ నియోజకవర్గం రెహమత్ నగర్ డివిజన్ లో మంత్రి పాదయాత్ర నిర్వహించారు. ఎస్.పి.ఆర్. హిల్స్ నుంచి జెండాకట్ట, కార్మికనగర్, వినాయకనగర్ తదితర ప్రాంతాల్లో ఆయన ఇంటింటికి తిరిగి విస్తృతంగా ప్రచారం నిర్వహించి కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్‌ను గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కాళేశ్వరం కమిషన్లతో జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ ను ఓడించాలని బిఆర్ఎస్ ప్రయత్నిస్తోందన్నారు. ఆ అవినీతి సొమ్ముతోనే బిఆర్ఎస్ విచ్చలవిడి ప్రచారం చేస్తోందని ఆరోపించారు. 500 రోజుల్లో ప్రభుత్వానికి ఏమైనా జరగొచ్చునంటూ కేటీఆర్ చేసిన ప్రకటనను ప్రస్తావిస్తూ రెండు సంవత్సరాలు పూర్తికాని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని 500 రోజుల్లో ఎలా కూలుస్తారని ప్రశ్నించారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ అవినీతి సొమ్ము ఏరులై పారుతుందని, ఓడిపోతామని తెలిసి



ఆ పార్టీ నాయకులు అవాకులు చవాకులు పేలుతున్నారన్నారు. విజ్ఞులైన ఓటర్లు గత పదేళ్లలో నాటి ప్రభుత్వం ప్రజలకు, ఈ ప్రాంతానికి ఏమి చేసిందో గమనించాలన్నారు. ఉచిత బస్సు మొదలు కొని ఎన్నోసంక్షేమ పథకాలు అమలు చేస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ ను మంచి మెజార్టీతో గెలిపించాలన్నారు. పదేళ్లలో చేయని అభివృద్ధి ఇప్పుడు బీఆర్ఎస్ తో ఏం జరుగుతుందని ప్రశ్నించారు. ఓట్ల కోసం వచ్చే భారాసా నాయకులను ఇంతవరకు ఏం అభివృద్ధి చేశారో చెప్పాలంటూ ప్రశ్నించాలని మంత్రి ప్రజలను కోరారు. ఈ మూడేళ్లే గాక మరో ఐదేళ్ల పాటు కాంగ్రెస్ ప్రభుత్వమే ఉంటుందని, పేదోళ్ల కన్నీరు తుడిచే వరకు కాంగ్రెస్ విశ్రమించదని మంత్రి పొంగులేటి అన్నారు. ఇందిరమ్మ ఇండ్లకు సంబంధించి తాము ఇంతవరకు గ్రామీణ ప్రజలపై దృష్టి సారించామని ఇకపై పట్టణ పేదలకు ఇండ్లు అందిస్తామని హామీ ఇచ్చారు.

**కాంగ్రెస్‌లో చేరికలు:**
మంత్రి పొంగులేటి సమక్షంలో ఎస్‌పీఆర్ హిల్స్‌లో బిఆర్ఎస్ నుంచి ప్రేమ్ ఆధ్వర్యంలో 200 మంది యువకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. బ్రహ్మశంకర్ నగర్‌లో బి.కళ ఆధ్వర్యంలో పదిమంది మహిళలు బిజేపీ నుంచి కాంగ్రెస్‌లో చేరగా మంత్రి పొంగులేటి వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు. కార్మికనగర్‌లో ఆటో యూనియన్ అధ్యక్షుడు సతీష్ ఆధ్వర్యంలో 200 మంది ఆటో డ్రైవర్లు బిఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ లో చేరారు. వీరికి మంత్రి పొంగులేటి, కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ స్వాగతం పలికారు. ఆటో కార్మికుల చేరిక సందర్భంగా యూనియన్ అధ్యక్షుడు సతీష్ ఆటోలో మంత్రి పొంగులేటి కొద్ది దూరం ప్రయాణించారు.

# ప్రజా సమస్యలు ప్రజావాణిలో పరిష్కారం

## జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి..ఫిర్యాదుల పరిష్కారానికి అధికారులకు ఆదేశాలు

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** ప్రజావాణిలో ప్రజలు సమర్పించిన ఫిర్యాదులకు అధిక ప్రాధాన్యతనిస్తూ సత్వరమే పరిష్కరించాలని జిల్లా అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా తమ సమస్యలు తెలపడానికి వచ్చిన ప్రజల నుండి ఫిర్యాదులను జిల్లా జిల్లా అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి, డీఆర్ఓ సంగీతతో కలిసి స్వీకరించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ... ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంలో శాఖల వారిగా స్వీకరించిన ఫిర్యాదులను సంబంధిత జిల్లా అధికారులు సత్వరపరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా, సమస్యలను పరి



ష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ రోజు నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి మొత్తం 25 ఫిర్యాదులు వచ్చాయని, వాటిని వెంటనే సంబంధిత అధికారులను పరిష్కరించే విధంగా తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి సంగీత, వివిధ శాఖల జిల్లా అధికారులు, మున్సిపల్ అధికారులు, మండల తహాశీల్దారులు, కలెక్టరేట్ సూపరింటెండెంట్లు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

**చేవెళ్ల బస్సు ప్రమాద మృతులకు నివాళులు...**
ప్రజావాణి కార్యక్రమానికి ముందు జిల్లా అదనపు కలెక్టర్ చంద్రా రెడ్డి, డీఆర్ఓ సంగీత, జిల్లా అధికారులు, వివిధ శాఖల జిల్లా అధికారులు, మున్సిపల్ అధికారులు, మండల తహాశీల్దారులు, కలెక్టరేట్ సూపరింటెండెంట్లు, సంబంధిత అధికారులందరు సోమవారం ఉదయం రంగారెడ్డి జిల్లా చేవెళ్ళ మండలం, మీర్జాగూడ వద్ద జరిగిన బస్సు ప్రమాదంలో మృతి చెందిన వారికి, రెండు నిమిషాలు మౌనం పాటించి నివాళ్లు అర్పించారు.



## ప్రభుత్వ భూమిని కాపాడాలని ప్రజావాణిలో ఫిర్యాదు

### మచ్చ జంగయ్య గంటీల వెంకటేష్

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** తెలంగాణ భూముల పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో ఇబ్రహీంపట్నం నియోజకవర్గ అధ్యక్షులు మచ్చ జంగయ్య, ఉపాధ్యక్షులు గంటీల వెంకటేష్, కబ్జాకు గురైన ప్రభుత్వ భూమిపై ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. మంచాల మండలం, ఆగపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని, నాగార్జునసాగర్ రహదారి సమీపంలోని సర్వే నెంబర్ 191,187లలో గల ప్రభుత్వ భూమిని ఆక్రమించి, వెంచర్ వేయడం జరిగింది. ప్రభుత్వ భూమి అక్రమంగా కబ్జా చేసిన, ఓ ప్రైవేటు రియల్ ఎస్టేట్ సంస్థ యజమానిపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ, తెలంగాణ భూముల పరిరక్షణ సమితి ఇబ్రహీంపట్నం నియోజకవర్గ అధ్యక్షులు మచ్చ జంగయ్య, ఉపాధ్యక్షులు గంటీల వెంకటేష్, సోమవారం రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రజావాణి కార్యక్రమంలో, రెవెన్యూ అదనపు కలెక్టర్ చంద్రారెడ్డికి ఫిర్యాదు చేసారు. గతంలో రెవెన్యూ అధికారులకు చాలా సార్లు ఫిర్యాదు చేసినా, తూతూ మంత్రంగా రెండు రోజులు సర్వే చేసి ప్రభుత్వ స్థలాన్ని గుర్తించి బోర్డు నాటించారు. ప్రభుత్వ అధికారులను కాదని వెంచర్ నిర్వాహకులు బోర్డుని అక్కడ నుంచి తొలగించి యధావిధిగా చేయడం జరిగింది. దీనిపై అధికారులకు ఫిర్యాదు చేసిన ఎలాంటి చర్యలు తీసుకోకుండా, స్థానిక రెవిన్యూ అధికారులు, వెంచర్ యాజమాన్యంతో కుమ్మక్కయ్యారని ఆరోపణలు వచ్చిన, ప్రభుత్వ భూమి కబ్జా చేస్తున్న ఏం మాత్రం పట్టించుకోకుండా, ప్రభుత్వ భూమిని కాపాడకుండా వెంచర్ యాజమాన్యానికి అనుకూలంగా వ్యవహరిస్తున్నారని అన్నారు. ప్రభుత్వ భూమిలో నుండి రోడ్డు నిర్మాణానికి సహకరించిన అధికారులపై శాఖా పరమైన కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ప్రస్తుతం కబ్జాకు గురైన భూమి విలువ కోట్లల్లో ఉంటుందని, విలువైన భూమిని కాపాడడంలో స్థానిక రెవెన్యూ అధికారులు విఫలమయ్యారని, వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. లేని యెడల మంచాల మండల తహసీల్దార్ కార్యాలయం దగ్గర న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తామని హెచ్చరించారు.

## కుమ్మర సంఘం జిల్లా ప్రింట్ మీడియా అధ్యక్షుడిగా గంగదారి శ్రావణ్

**ఆలేరు, మహా:** తెలంగాణ రాష్ట్ర కుమ్మర సంఘం యాదాద్రి భువనగిరి జిల్లా ప్రింట్ మీడియా అధ్యక్షుడిగా గంగదారి శ్రావణ్ కుమార్ఎన్నికయ్యారు.ఈ సందర్భంగా సోమవారం ఆలేరు పట్టణంలోని వర్షి బైక్ బజార్ కార్యాలయంలో సీనియర్ జర్నలిస్టుల ఆధ్వర్యంలో గంగాధరి శ్రావణ్‌ను ఘనంగా సత్కరించారు.కార్యక్రమంలో పాల్గొన్న సీనియర్ జర్నలిస్టులు గంగదారి శ్రావణ్‌కు శాలువా కప్పి అభినందనలు తెలిపారు.మీడియా రంగంలో ఆయన చేస్తున్న సేవలు,సామాజిక అంశాలపై ప్రతిస్పందన,ప్రజల సమస్యలపై చురుకైన రిపోర్టింగ్‌కి గుర్తింపుగా ఈ బాధ్యతను అప్పగించారని తెలిపారు.ఈ సందర్భంగా గంగాధరి శ్రావణ్ మాట్లాడుతూ ఈ బాధ్యత నాకు చాలా గౌరవకరం.కుమ్మర సంఘం సమస్యలను మీడియా ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి,పరిష్కారానికి కృషి



చేస్తాననీ,మన వృత్తిపరమైన హక్కులు,సామాజిక గుర్తింపును కాపాడటానికి మీడియా శక్తిని ఉపయోగిస్తాను అని అన్నారు.అలాగే ఆయన ప్రత్యేకంగా జర్నలిస్టులు దూడల సాగర్,పోతుగంటి సంపత్ కుమార్, గంగదారి సుధీర్ కుమార్ లకు కృతజ్ఞతలు తెలిపారు.ఈ సందర్భంగా స్థానిక మీడియా ప్రతినిధులు,కుమ్మర సంఘం సభ్యులు,నాయకులు గంగాధరి శ్రావణ్‌కు అభినందనలు తెలిపారు.



## బస్సు ప్రమాద ఘటన దురదృష్టకరం

### క్షతగాత్రులకు మెరుగైన వైద్యం ప్రభుత్వం అందిస్తుంది: ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్

**రాజేంద్రనగర్, మహా;** చేవెళ్ల మండలం మీర్జాగూడ వద్ద బస్సు రోడ్డు ప్రమాద ఘటన చోటు చేసుకోవడం దురదృష్టకరము. ఈ ప్రమాదంలో 21 మంది ప్రయాణికులు చనిపోవడం అత్యంత బాధాకరమని ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ పేర్కొన్నారు. బస్సు ప్రయాణికులపై టిప్పర్ డ్రైవర్ నిర్లక్ష్యంతో అతివేగంగా నడుపుతూ ఎదురుగా వస్తున్న బస్సును ఢీ కొనడంతో టిప్పర్ లో ఉన్న కంకర బస్సులో పడిపోవడంతో 21 మంది ప్రయాణికులు ప్రాణాలు కోల్పోయిన తీవ్ర విషాద ఘటన కలిచివేసిందన్నారు. మృతుల ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రమాదంలో గాయపడిన క్షతగాత్రులకు రాష్ట్ర ప్రభుత్వం మెరుగైన వైద్యం అందిస్తుంది. మృతుల కుటుంబాలను ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకుంటుందన్నారు.

# నెరవేరుతున్న దశాబ్దాల కళ

- మక్తమాధారం నేదునూరు రోడ్డు
- రూ. కోటి 20లక్షలతో బీటీ రోడ్డు ఏర్పాటు
- సంతోషం వ్యక్తం చేస్తున్న స్థానికులు

**ఆమనగల్లు, మహా:** దశాబ్దాల కాలంగా మక్తమాధారం నేదునూరు రోడ్డును అభివృద్ధి చేయాలని స్థానిక మాజీ సర్పంచ్ యాట నర్సింహా, కాంగ్రెస్ పార్టీ కిసాన్ సెల్ మండల అధ్యక్షుడు అర్కోటం బాల్ రాజ్ చొరవతీసుకుని స్థానిక ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి దృష్టికి ఈ రోడ్డు విషయాన్ని తీసుకెళ్లారు. స్పందించిన ఎమ్మెల్యే నాలుగు నెలల క్రితం బీటీ రోడ్డు ఏర్పాటుకు పనులు ప్రారంభించారు. కంకర వేసి రోడ్డు పనులు చేపట్టిన గుత్తేదారు గత ప్రభుత్వం 1. 2కిలోమీటర్ వరకు రూ. కోటి 20లక్షలు మాత్రమే




నిధులు మంజూరు చేసింది. అంతవరకు మాత్రమే బీటీ పనులు కొనసాగుతున్నాయి. మిగిలిన 1కిలోమీటర్ బీటీ పనులు త్వరగా ప్రారంభించాలని ప్రజలు కోరుతున్నారు.

## జూబ్లీహిల్స్ లో జోరుగా కొనసాగుతున్న ఎన్నికల ప్రచారం

### పాల్గొన్న తుర్కపల్లి కాంగ్రెస్ నేతలు

**జూబ్లీ హిల్స్, మహా:** జూబ్లీహిల్స్ లోని రహమత్ నగర్ లో ప్రతి గల్లి,వాడ తిరుగుతూ చేయి గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరుతూ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి నవీన్ యాదవ్ తో కలసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు యాదాద్రి భువనగిరి జిల్లా తుర్కపల్లి మండల కాంగ్రెస్ పార్టీ నేతలు. ఈ కార్యక్రమంలో మదర్ డైరీ ఛైర్మెన్ గుడి పాటి మధు సూదన్ రెడ్డి,ఆలేరు మార్కెట్ కమిటీ చైర్మన్ ఐనాల చైతన్య మహేందర్ రెడ్డి ,మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు దానావత్ శంకర్ నాయక్,మండల కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎరుకల వెంకటేష్ గౌడ్,ఓబీసీ సెల్ జిల్లా కో ఆర్డినేటర్



దేవరుప్పల ఐలయ్య,మండల కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు భూక్యా రాజారామ్ నాయక్,సీనియర్ కాంగ్రెస్ నాయకులు, ఐనాల మహేందర్ రెడ్డి, నాగాయపల్లి శివ రాములు,సముద్రాల వెంకటేష్,చాడ కరుణాకర్ రెడ్డి,గాజె మల్లేష్,రాజు,చంద్ర శేఖర్,తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు..

## గండిపేట మండలంలో సిఐటియు ఆధ్వర్యంలో అన్ని రంగాల కార్మికులతో జనరల్ బాడీ సమావేశం

**గండిపేట, మహా:** గండిపేట మండలంలోని నార్సింగ్ మున్సిపాలిటీ కోకాపేట్ కమిటీ హాల్ లో సోమవారం సిఐటియు ఆధ్వర్యంలో మండలంలోని అన్ని రంగాలలో పనిచేస్తున్న కార్మికులతో జనరల్ బాడీ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సీనియర్ నాయకులు అశోక్ మరియు సీఐటీయూ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు జె.రుద్రకుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికులకు కనీస వేతనంగా 26 వేల రూపాయలు అందించాలని, సిఐటియు అనేక పోరాటాలు చేస్తున్న కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఇవేం పట్టించుకోకుండా కార్మికుల మధ్య విభేదాలు సృష్టిస్తున్నారన్నారు. కాబట్టి కార్మికులందరూ ప్రజా వ్యతిరేక విధానాలు ఎప్పటికప్పుడు సిఐటియు ట్రేడ్ యూనియన్ ద్వారా తెలుసుకుంటూ తమ సమస్యల పరిష్కారం కోసం ముందుకు కొనసాగాలని అన్నారు. అనంతరం గండిపేట మండలంలోని మున్సిపాలిటీల వారిగా కమిటీలు వేసి సభ్యులను ఎన్నుకున్నారు. ఈ కమిటీల ద్వారా రానున్న రోజుల్లో



నార్సింగ్ మున్సిపాలిటీ మరియు బండ్లగూడ జాగిర్ మున్సిపల్ కార్పొరేషన్ ప్రాంతాలలో కార్మికుల సమస్యల పైన నిరంతరం పోరాటం జరుపుతారన్నారు. అంతేకాకుండా ఈనెల 10 మరియు 11 వ తేదీలలో రంగారెడ్డి జిల్లా, రాజేంద్రనగర్ మండలం కాటేదాన్ లో ఏర్పాటు చేయనున్న బహిరంగ సభకు కార్మికులందరూ అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రమాదానికి దారితీసిన స్పీడ్ బ్రేకర్లు..!

- ఆర్టీసి బస్సును ఢీకొట్టిన ప్రయివేట్ ట్రావెల్స్ బస్సు
- ఓ ప్రైవేట్ ఇంజనీరింగ్ కళాశాల కోసమే స్పీడ్ బ్రేకర్లు
- ఎలాంటి సూచిక బోర్డు లేకపోవడమే ప్రమాదాన్ని కారణం

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** సాగర్ రహదారిపై స్పీడ్ బ్రేకర్ల వల్ల ఆర్టిసి బస్సును, ప్రయివేట్ ట్రావెల్ బస్సు ఢీకొట్టిన ఘటన ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం రంగారెడ్డి జిల్లా, ఇబ్రహీంపట్నం మండలం, శేరిగూడ పరిధిలోని శ్రీఇందు కళాశాల సమీపంలో సాగర్ రహదారి పై సోమవారం తెల్లవారుజామున ఆంధ్రప్రదేశ్ పాపం పోదిలి ఆర్టీసీ డిపోకు చెందిన బస్సును, స్పీడ్ బ్రేకర్ల కారణంగా, దోస్త్ టూర్స్ అండ్ ట్రావెల్స్ ప్రైవేట్ బస్సు అతివేగంగా వచ్చి, ఆర్టీసీ బస్సును ఢీకొట్టడంతో ఇరు బస్సులు పాక్షికంగా దెబ్బతిన్నాయి. కాగా ఆంధ్రప్రదేశ్ నుండి హైదరాబాద్ కు ప్రయాణికులతో వెళ్తుండగా ఈ ప్రమాదం చోటు చేసుకుంది. ఈ ఘటన సమయంలో బస్సులో ప్రయాణిస్తున్న ప్ర



యాణికులకు ఎవరికీ ఎలాంటి గాయాలు కాకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. కాగా ఈ ప్రమాదానికి కారణం సాగర్ రహదారిపై పై ఆదివారం ఏర్పాటు చేసిన స్పీడ్ బ్రేకర్ల ప్రమాదం జరిగిందని, స్పీడ్ బ్రేకర్ల వద్ద ఎలాంటి సూచిక బోర్డు లేకపోవడంతో, రేపటి లాగే వేగంగా ప్రయివేట్ ట్రావెల్స్ బస్సు రావడం వల్ల ప్రమాదం చోటు చేసుకుంది. ఇది ఇలా ఉండగా గతవారం రోజుల క్రితం, ఇదే రోడ్డుపై స్పీడ్ బ్రేకర్ ఏర్పాటు చేయగా రెండు ప్రమాదాలు చోటు చేసుకున్నాయి. దీంతో వెంటనే ఆ స్పీడ్ బ్రేకర్ ను తొలగించారు. మళ్ళీ వేయడంతో ప్రమాదం జరిగింది. స్పీడ్ బ్రేకర్ల కారణంగా గడిచిన మూడు రోజుల నుండి దాదాపు ఆరు టక్కర్లు జరిగాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు వెంటనే స్పందించి రహదారిపై స్పీడ్ బ్రేకర్లను తొలగించి ప్రమాదాలు జరగకుండా చూడాలని స్థానికులు కోరారు.



## నార్సింగి పోలీస్ స్టేషన్ పరిధిలో వ్యక్తి అదృశ్యం

**గండిపేట,మహా:** ఇంట్లో నుండి బయటకు వెళ్లి అదృశ్యమైన సంఘటన గండిపేట మండలం నార్సింగి పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది.నార్సింగి సీఐ హరికృష్ణారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం నార్సింగి మున్సిపాలిటీలోని ఆర్ఆర్ ట్రాపికోన అపార్ట్మెంట్స్ లోని ఫ్లాట్ నెంబర్ 301 లో నివాసం ఉంటున్న నాగభూషణ్ రెడ్డి (65), ఈనెల రెండవ తేదీన ఉదయం ఎనిమిది గంటల 20 నిమిషాల సమయంలో ఇంట్లో నుండి బయటకు వెళ్లి సాయంత్రమైనా తిరిగి ఇంటికి రాకపోవడంతో ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు, పరిసర ప్రాంతాలలో మరియు బంధువుల వద్ద వెతికిన ఫలితం లేకపోవడంతో సోమవారం నార్సింగ్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారన్నారు. తప్పిపోయిన వ్యక్తి నీలిరంగు టీషర్ట్, నలుపు రంగు ప్యాంట్ వేసుకున్నాడని సదరు వ్యక్తి ఎవరికైనా కనిపించిన మరియు తెలిసిన నార్సింగి పోలీస్ స్టేషన్ కు సమాచారం అందించాలని తెలిపారు.

# చేవెళ్ల రోడ్డు ప్రమాదానికి గత ప్రస్తుత ప్రభుత్వమే బాధ్యత వహించాలి

### సిపిఎం తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** సోమవారం చేవెళ్ల మండల పరిధిలోని మిర్జాగూడ గేటు వద్ద జరిగిన ప్రమాదంలో, చనిపోయిన వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి విచారం వ్యక్తం చేస్తూ బాధితులను పరామర్శించడం జరిగింది. ఈ సందర్భంగా సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ మాట్లాడుతూ... ఈ ప్రమాదానికి ప్రభుత్వమే బాధ్యత వహించాలని, ఈ ప్రాంత మాజీ మంత్రులు, ఎంపీలు నిర్లక్ష్యం కారణంగా అప్పా జంక్షన్ నుండి మన్నెగూడ వరకు రోడ్డు విస్తరణ పనులు జరగలేదని అన్నారు. 2018లో గ్రీన్ ట్రిబ్యునల్ లో కేసు వేస్తే అంతకన్నా ముందు ఈ ప్రాంతం నుంచి మంత్రిగా బాధ్యతలు వహించిన సబితా ఇంద్రారెడ్డి, తీవ్ర నిర్లక్ష్యం వల్ల రోడ్డు విస్తరణ పనులు జరగలేదని మండిపడ్డారు. హైదరాబాద్ చుట్టూ ఉన్నటువంటి జాతీయ రహదారులన్నీ విస్తరణ జరిగాయని హైదరాబాదుకు ఆనుకొని



ఉన్న బీజాపూర్ జాతీయ రహదారి మాత్రమే విస్తరణ జరగలేదని తెలిపారు. ప్రస్తుతం బిజెపి ఎంపీ కొండ విశ్వేశ్వర్ రెడ్డి బీజాపూర్ జాతీయ రహదారి పనులకు 2017 లోనే అనుమతి తీసుకువచ్చానని చెప్పారని, ఎందుకు రోడ్డు విస్తరణ పనులు ఆగిపోయాయని ప్రశ్నించారు. ఇప్పుడు కేంద్రంలో ఉన్నది బీజేపీ ప్రభుత్వమే అని ఎన్జీటిలో కేస్ వికెట్ చేయించి రోడ్డు విస్తరణ పనులు ప్రారంభం చేసే బాధ్యత ఎంపీ కొండ విశ్వేశ్వర్ రెడ్డి పైన ఉందని, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో రోడ్డు విస్తరణ పనులు ప్రారంభించాలని అన్నారు. ప్రమాదంలో చనిపోయిన మృతుల కుటుంబాలకు 25 లక్షలు ఎక్స్గ్రేషియా చెల్లించాలని, ఆర్టీసీ, టిప్పర్ యాజమాన్యంతో నష్టపరిహారం వచ్చే విధంగా ప్రభుత్వం చూడాలని అన్నారు. ప్రమాదంలో తల్లిదండ్రులను కోల్పోయి అనాథలైన పిల్లల సంరక్షణ బాధ్యత ప్రభుత్వం తీసుకోవాలని డిమాండ్ చేశారు. బాధితులను పరామర్శించిన వారిలో సిపిఎం రాష్ట్ర నాయకులు డీజి నరసింహారావు, సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కాడిగళ్ల భాస్కర్, చేవెళ్ల డివిజన్ కార్యదర్శి అల్లి దేవేందర్, ఎస్ఎఫ్ఐ డివిజన్ కార్యదర్శి బేగరి అరుణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.


## కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసిన భువనగిరి ఎమ్మెల్యే

**భువనగిరి, మహా:** భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి కేంద్రమంత్రి కిషన్ రెడ్డిని సోమవారం నాడు మర్యాద పూర్వకంగా కలిసి నవంబర్ 7 న హైదరాబాద్ హైటెక్స్ లో జరిగే తన కుమారుడు శ్రీరామ్ రెడ్డి వివాహాని వచ్చి ఆశీర్వదించాలని పెండ్లి పత్రికను అందించి ఆహ్వానించారు..



## కర్ణాటక ఉప ముఖ్యమంత్రిని కలిసిన భువనగిరి ఎమ్మెల్యే అనిల్ రెడ్డి

**భువనగిరి, మహా:** నవంబర్ 7వ తేదీన హై టెక్స్ లో జరుగబోయే తన కుమారుడు శ్రీ రామ్ రెడ్డి వివాహ వేడుకకు హాజరు కావాలని కర్ణాటక రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి డీకే శివ కుమార్ ను బెంగుళూరులో వారి నివాసంలో కలిసి వివాహ పత్రిక ను అందించి ఆహ్వానించిన భువనగిరి శాసనసభ్యులు కుంభం అనీల్ కుమార్ రెడ్డి ...



# ప్రజావాణి దరఖాస్తులు సత్వరం పరిష్కారించాలి

### జిల్లా కలెక్టర్ హనుమంతరావు

**యాదాద్రి భువనగిరి, మహా:** ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను పెండింగ్ లేకుండా సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ హనుమంతరావు సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం రోజు కలెక్టరేట్ సమావేశ మందిరంలో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ వీరారెడ్డి, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కరరావు లతో కలిసి జిల్లా కలెక్టర్ వివిధ ప్రాంతాల ప్రజల నుండి 68 అర్జీలను స్వీకరించారు. ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను సంబంధిత అధికారులు పెండింగ్ లేకుండా ఎప్పటికప్పుడు పరిశీలించి పరిష్కరించాలన్నారు. అందులోరెవిన్యూశాఖ 56,ఎంప్లాయిమెంట్ 3,జిల్లా పంచాయతీ 2,ఇరిగేషన్ 2,ఎక్సైజ్,బీసీ వెల్ఫేర్,జిల్లా సంక్షేమ శాఖ,జిల్లా గ్రామీణ అభివృద్ధి , సర్వే ల్యాండ్ శాఖలకు ఒక్కొకటి చొప్పున వచ్చాయని తెలిపారు. వివిధ శాఖలకు వచ్చిన దరఖాస్తులను తక్షణమే పరిశీలించి ప్రజల సమస్యలు పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రజావాణి అనంతరం జిల్లా కలెక్టర్ మండల స్పెషల్ అధికారులతో సమీక్షిస్తూ... ధాన్యం కొనుగోలు కేంద్రాలను మండల స్పెషల్ అధికారులు క్షేత్రస్థాయిలో కేంద్రాలను తనిఖీ చేసి రైతులకు ఏ ఇబ్బంది లేకుండాచూడాలన్నారు. కేంద్రాలలో ధాన్యం తేమశాతం వచ్చిన వెంటనే కాంటా వేసి కొనుగోలు చేయాలని, లారీల కొరత లేకుండా ఎప్పటికప్పుడు మిల్లులకు తరలించాలన్నారు. కొనుగోలు కేంద్రాలలో తేమ శాతం మిషన్లు సరిగా పనిచేస్తున్నాయా లేదా అని తరచూ పరిశీలించాలన్నారు. మండల ప్రత్యేక అధికారులు క్షేత్రస్థాయిలో తరచూ పర్యటించాలని ఆదేశించారు.విధులలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. బడిబాట కార్యక్రమంలో బాగంగా మండల స్పెషల్ ఆఫీసర్స్ పాఠశాలల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించి విద్యార్థులకు మెనూ ప్రకారం మంచి రుచికరమైన భోజనం అందిస్తున్నారా లేదా అని పరిశీలించాలన్నారు. పదవ తరగతి విద్యార్థుల పై ప్రత్యేక ఫోకస్ పెట్టి,వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలన్నారు. ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు మండల స్పెషల్ అధికారులు సూచన చేస్తూ లబ్ధిదారులు వివిధ దశలో ఇళ్ల నిర్మాణం పనులు పూర్తిచేయాలన్నారు.



## తేమ శాతం చూసి వెంటనే కాంటా వేయండి...

### జిల్లా కలెక్టర్ హనుమంతరావు

**యాదగిరిగుట్ట, మహా :** క్రమం తప్పకుండా ధాన్యం తేమ శాతం చూసి వెంటనే కాంటా వేసి కొనుగోలు చేయాలని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు అన్నారు. సోమవారం యాదగిరిగుట్ట మండలం చొల్లేరు గ్రామంలో ఉన్న ఐ.కే.పి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ ఆకస్మిక తనిఖీ చేశారు... ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రైతులతో మాట్లాడుతూ... ఎన్ని ఎకరాలు వేశారని అడిగి తెలుసుకున్నారు. వాతావరణంలో మార్పులు వల్ల అకాల వర్షాలతో రైతులు ఇబ్బందులు పడకుండా ధాన్యం కుప్పలకు టార్పాలిన్ లతో కప్పి , చుట్టూ మడిగేలు కట్టి భద్రపర్చుకోవాలని రైతులకు సూచించారు. తేమశాతం ప్రతి రోజు ఉదయం ,సాయంత్రం చూస్తూ తేమశాతం వచ్చిన వెంటనే ఎంత రాత్రి సమయంలో అయిన ఉండి కాంటా వేసి కొనుగోలు చేయాలని నిర్వాహకులకు ఆదేశించారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని మిల్లులకు తరలించేందుకు లారీలు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. ట్యాబ్ ఎంట్రీలు ఎప్పటికపుడు పూర్తి చేయాలని కేంద్ర నిర్వాహకులకు ఆదేశించారు.



# రెడ్ హాట్ మిర్చిలా అనన్య..

## బుల్లి డ్రెస్సులో హీటెక్కిస్తోన్న వయ్యారి

అనన్య నాగళ్ల తెలుగు ప్రేక్షకులకు ప్రత్యేకంగా పరిచయం చేయాల్సిన పని లేదు.. ప్రియదర్శితో కలిసి మల్లేశం మూవీతో టాలీవుడ్ లో అడుగు పెట్టింది. తెలంగాణలోని ఖమ్మం జిల్లా సత్తు పల్లికి చెందిన అనన్య హైదరాబాద్ లో ఇంజనీరింగ్ పూర్తి చేసింది. ఆ తర్వాత ఇన్ఫోసిస్ లో సాఫ్ట్ వేర్ ఉద్యోగంలో కూడా చేరింది. మల్లేశం సినిమాతో మంచి క్రేజ్ తెచ్చుకున్న ఈ ముద్దుగుమ్మ పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ మూవీ 'వకీల్ సాబ్' మూవీలో నటించే ఛాన్స్ కొట్టేసింది. ఆ తరువాత ఈ ముద్దుగుమ్మ చిన్న చిన్న అవకాశాలు మాత్రమే వచ్చాయి.. అవి కూడా అంత గుర్తింపు తెచ్చి పెట్టలేదు. పవన్ కల్యాణ్ వకీల్ సాబ్, మ్యాస్ట్రో, ఊర్వశివో రాక్షసివో, శాకుంతం, మళ్లీపెళ్లి తదితర సినిమాలతో క్రేజీ హీరోయిన్ గా మారిపోయింది అయితే ఇక ఇటీవల అనన్య నటించిన పొట్టేల్ సినిమా కూడా సూపర్ హిట్ గా నిలిచింది. ఇందులో ఆమె పోషించిన బుజ్జమ్మ పాత్రకు విమర్శకుల ప్రశంసలు దక్కాయి.



# ఆరు నెలల వరకు అవకాశాలు రాలేదు..

తెలుగులో వరుస అవకాశాలతో మంచి గుర్తింపు తెచ్చుకున్న హీరోయిన్ అనుపమ పరమేశ్వరన్. తక్కువ సమయంలోనే విపరీతమైన ఫ్యాన్ ఫాలోయింగ్ సంపాదించుకుంది. ఈ ఏడాది పరదా, కిష్కింధపురి, జానికి వర్సెస్ స్టేట్ ఆఫ్ కేరళ చిత్రాలతో అడియన్స్ ముందుకు వచ్చింది. అయితే గతంలో ఓ ఆరునెలలు అవకాశాలు రాలేదట. టిల్లు స్క్వేర్ సినిమాతో గ్లామర్ హద్దులు చెరిపేసిన అనుపమ.. గతంలో ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ ఆ సినిమా చేయకుండా ఉండాల్సిందని చెప్పుకొచ్చింది. రంగస్థలం సినిమాలో హీరోయిన్ గా సమంత కంటే ముందు తననే అనుకున్నారని.. అందుకు సుకుమార్ టీం తనను సంప్రదించారని. తాను ఓకే చేశానని తెలిపింది. అయితే ఆ తర్వాత ఏం జరిగిందో తెలియదని.. తనను తప్పించి సమంతను తీసుకున్నారని.. కానీ సోషల్ మీడియాలో తానే కావాలని రిజెక్ట్ చేసినట్లు వార్తలు రాశారట. ఆ వార్తలతో తనకు ఆరు నెలల వరకు అవకాశాలు రాలేదని తెలిపింది. తెలిసీ తెలియకుండా రాసే ఇలాంటి వార్తల వల్ల కెరీర్ పరంగా చాలా ఇబ్బంది పడ్డానని తెలిపింది. ఇటీవలే కిష్కింధపురి సినిమాతో సూపర్ హిట్ ఖాతాలో వేసుకుంది అనుపమ. హారర్ థ్రిల్లర్ డ్రామాగా వచ్చిన ఈ సినిమా ప్రేక్షకులను ఆద్యంతం ఆకట్టుకుంది. ప్రస్తుతం అనుపమ చేతినిండా సినిమాలతో ఫుల్ బిజీగా ఉంది అనుపమ. మరోవైపు సోషల్ మీడియాలో వరుస సినిమాలతో ఫుల్ బిజీగా ఉంది అనుపమ పరమేశ్వరన్.





# ఫైట్ చేసేద్దాం

నువ్వా... నేనా తేల్చేసుకుందాం... ఫైట్ చేసేద్దాం అనే టైపులో విలన్లకు సవాల్ విసిరి, రంగంలోకి దిగాడు శంకరవరప్రసాద్. అందర్నీ రఫ్ఫాడించడం మొదలుపెట్టాడు. చిరంజీవి హీరోగా రూపొందుతున్న తాజా చిత్రం 'మన శంకరవరప్రసాద్ గారు'కి సంబంధించిన షూటింగ్ అప్‌డేట్ ఇది. అనిల్ రావిపూడి దర్శకత్వంలో సాహు గారపాటి, సుస్మిత కొణిదెల నిర్మిస్తున్న ఈ చిత్రంలో చిరంజీవి టైటిల్ రోల్ చేస్తున్నారు. ఓ కీలక పాత్రలో హీరో వెంకటేశ్, హీరోయిన్‌గా నయనతార నటిస్తున్నారు. ఈ చిత్రం షూటింగ్ హైదరాబాద్‌లో జరుగుతోంది. చిరంజీవి, ఫైటర్స్ పాల్గొనగా ఫైట్ చిత్రీకరిస్తున్నారు. "ఈ స్టైలిష్ క్లైమాక్స్ ఫైట్ సీక్వెన్స్ విజువల్‌గా అద్భుతంగా ఉంటుంది. ఫైట్ మాస్టర్ వెంకట్ పర్యవేక్షణలో రూపొందిస్తున్నాం" అని యూనిట్ పేర్కొంది. ఈ చిత్రం వచ్చే సంక్రాంతికి రిలీజ్ కానుంది.

# రమ్యకృష్ణని ఇలా ఎప్పుడూ చూడలేదు!

రమ్యకృష్ణ పేరు చెప్పగానే ఇప్పటి జనరేషన్‌కి అయితే శివగామి పాత్ర గుర్తొస్తుంది. ఎందుకంటే 'బాహుబలి'లో ప్రభాస్, రానానే కాదు రమ్యకృష్ణ తన యాక్టింగ్‌తో చూపించిన డామినేషన్.. ఈమె సెకండ్ ఇన్నింగ్స్‌కి మంచి పునాది వేసింది. ఇప్పటికీ వరస సినిమాలు చేస్తూ బిజీగా ఉన్న రమ్యకృష్ణ.. మునుపెన్నడూ లేని విధంగా ఓ దెయ్యం సినిమా కోసం కనిపించనుంది. ఆ లుక్స్ ఇప్పుడు తెగ వైరల్ అయిపోతున్నాయి. గత కొన్నాళ్లుగా సినిమాలైతే చేస్తున్నాడు గానీ ఒక్క హిట్ కూడా కొట్టలేకపోతున్న డైరెక్టర్ రాంగోపాల్ వర్మ.. ప్రస్తుతం 'పోలీస్ స్టేషన్ మైన్ భూత్' అనే హారర్ మూవీ తీస్తున్నాడు. మనోజ్ బాజ్‌పాయ్ పోలీస్‌గా చేస్తున్నాడు. కొన్నాళ్ల క్రితం ఈ చిత్రం గురించి చెప్పిన ఆర్జీవీ.. ఓ డాన్ చనిపోయి దెయ్యమవుతాడని, తర్వాత పోలీసులని ఎలా ఇబ్బంది పెట్టాడనేది కాన్సెప్ట్ అని చెప్పుకొచ్చాడు. ఈ సినిమాలో రమ్యకృష్ణ కూడా నటిస్తోందని, ఆమె లుక్ ఇదేనంటూ ఆర్జీవీ రెండు ఫొటోలని పోస్ట్ చేశాడు. గతంలో ఎన్నడూ లేని విధంగా మాసీగా కనిపించింది. చేతిలో సిగరెట్, ముఖంపై బొట్లు, జీన్స్ ప్యాంట్ ఇలా టామ్ బాయ్ తరహాలో కనిపించింది. అయితే ఈమెది దెయ్యం పాత్ర కాదని ఆర్జీవీ క్లారిటీ ఇచ్చాడు. రీసెంట్‌గానే 'బాహుబలి' మూవీ ఎపిక్ పేరిట రిలీజైంది. దీంతో ఆ మూవీ లవర్స్.. మా శివగామిని ఇలా మార్చేశారేంటి? అని మాట్లాడుకుంటున్నారు.





# ఎన్టీఆర్ – ప్రశాంత్ నీల్ డ్రాగన్ రెండు భాగాలుగా..

మ్యాన్ ఆఫ్ మాసెస్ జూనియర్ ఎన్టీఆర్ , మాస్ డైరెక్టర్ ప్రశాంత్ నీల్ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న పాన్ ఇండియా యాక్షన్ ఎంటర్‌టైనర్ "డ్రాగన్" . కొద్ది రోజులు బ్రేక్ తీసుకున్న చిత్ర బృందం ఇప్పుడు శరవేగంగా షూటింగ్ జరుపుకుంటుంది. ఈ మాస్ ప్రాజెక్ట్‌ను మైత్రి మూవీ మేకర్స్ సంస్థ అత్యంత భారీ బడ్జెట్ తో నిర్మిస్తోంది. ఇప్పటికే రెండు భారీ షెడ్యూళ్లు పూర్తయ్యాయి. లీకైన ఔట్‌పుట్ చూసి ఫ్యాన్స్‌లో భారీ ఆసక్తి నెలకొంది. మొదట "డ్రాగన్" సినిమాను ఒకే భాగంగా తెరకెక్కించాలని అనుకున్న మేకర్స్, ఇప్పుడు రెండు పార్ట్స్‌గా ప్లాన్ చేసినట్టు సమాచారం. కథలో ఉన్న కంటెంట్‌ను దృష్టిలో ఉంచుకుని, రెండు భాగాలుగా తీసిన కూడా సినిమాకు నష్టం ఉండదని యూనిట్ భావిస్తోందట. ఇక, ప్రశాంత్ నీల్‌కి రెండు భాగాల సినిమాలపై ప్రత్యేక నైపుణ్యం ఉంది. ఆయన దర్శకత్వంలో వచ్చిన "కేజీఎఫ్" ఫ్రాంచైజీ రెండు భాగాలుగా వచ్చి భారీ విజయం సాధించింది. ఆ తర్వాత ప్రభాస్‌తో చేసిన "సలార్ పార్ట్ 1: సీజ్ ఫైర్" కూడా మంచి హిట్‌గా నిలిచింది. అయితే సీక్వెల్ "సలార్ 2: శౌర్యాంగ పర్వం" ఇంకా సెట్స్ మీదకు రాలేదు. కానీ, ఎన్టీఆర్‌తో వస్తున్న "డ్రాగన్" మాత్రం రెండు భాగాలుగా ఒకేసారి షూట్ జరుపుకొని, తక్కువ గ్యాప్‌లో రిలీజ్ చేయాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు. అంటే మొదటి భాగం తర్వాత రెండో భాగం కోసం ఫ్యాన్స్ ఎక్కువగా ఎదురుచూడాల్సిన అవసరం లేకుండా ఉంటుందని తెలుస్తోంది.ఇక సినిమాలో రుక్మిణి వసంత్ హీరోయిన్‌గా నటిస్తోంది. ఆమె పాత్ర కూడా కథలో కీలకమైన హైలైట్‌గా నిలుస్తుందని టాక్. ఈ చిత్రం ఎన్టీఆర్ ఫ్యాన్స్‌కు డబుల్ ట్రీట్ ఇవ్వబోతుందని యూనిట్ చెబుతోంది. ప్రస్తుతం సినిమా ప్రమోషన్స్ కోసం సరైన ముహూర్తం చూసి స్ట్రాటజీ సిద్ధం చేస్తోందట టీమ్. ఇక మాస్ అండ్ స్టైలిష్ యాక్షన్ సీక్వెన్సులతో కూడిన ఈ చిత్రం, విడుదలయ్యే సమయానికి పాన్ ఇండియా లెవెల్‌లో భారీ హంగామా సృష్టించబోతోందని సినీ వర్గాలు అంటున్నాయి. దర్శకుడు ప్రశాంత్ నీల్ , హీరో జూనియర్ ఎన్టీఆర్, హీరోయిన్ రుక్మిణి వసంత్ కాంబినేషన్ నుంచి వస్తున్న "డ్రాగన్" సినిమా నిజంగా ఫ్యాన్స్‌కి డబుల్ ఫీస్ట్ ఇవ్వబోతోందనే అంచనాలు ఉన్నాయి.

EDITOR, PRINTER,PUBLISHER AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, PRINTED AT 19-12-458, BAIRAGIPATTEDA, TIRUPATHI - 517501, A.P., REGD NO : APTEL/2014/58382. PH NO : 6300992296, Email : mahapathrika2003@gmail.com.
PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. Corporate Office : 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana, IN - 500034